
"ఆమెను మరిచిపోలేకపోతున్నాను" ఫోన్‌లో కన్నన్ మాటలకు షాకయ్యేను. బాలెవాడిలో ఉండగా కన్నన్ నుంచి మిస్‌డ్‌కాల్ వచ్చినట్టు గమనించేను.

నేషనల్ ఇన్స్యూరెన్స్ ఎకాడమీలో వారం రోజుల ట్రెయినింగ్ నిమిత్తం పూనా వచ్చేను. పూనా రావటం ఇది రెండవసారి.

కిందటేడు కూడా ప్రోగ్రామ్ ఫర్ యంగ్ ఎగ్జిక్యూటివ్స్ సెషన్ అటెండ్ అవ్వటానికి సరిగ్గా జనవరి నెలలో పూనా వచ్చేను. ఇరవై ఒక్క రోజుల ప్రోగ్రాం అది.

క్రితంసారి మూడువారాలు పూనాలో ఉండి కూడా ఏమీ తీసుకురాలేదని శ్రీమతి, పిల్లలూ చాలా రోజులు అలక పూనారు. ఈసారి వారికి ఆ అవకాశం ఇవ్వకూడదని ట్రెయినింగ్ ఆఖరి రోజున షాపింగ్‌కని బయలుదేరాను. అదిగో



# యథార్థం

అప్పుడు గమనించేను కన్నన్ నుంచి మిస్‌డ్‌కాల్ వచ్చిన విషయం. వెంటనే కన్నన్‌కు ఫోన్ చేసేను. అవుటాఫ్ కాలింగ్ ఏరియా అంటూ సమాధానం రావటంతో కన్నన్‌కు తిరిగి ఫోన్ చేసే ప్రయత్నాన్ని వాయిదా వేసి, శనివార్‌పేటకు ఆటో మాట్లాడుకుని షాపింగ్ కార్యక్రమంలో లీనమయ్యేను.

శ్రీమతికి పూనా స్పెషల్ శారీ, పిల్లలకు సాఫ్ట్ చాక్‌లెట్స్, లోనావాలా ఫేమస్ చిక్కీలు పర్చేజ్ చేసి టైమ్ చూసుకుంటే నాలుగు దాటింది. ఏడూనలభైకి కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌కి ముందుగానే రిజర్వేషన్ చేయించుకున్నాను.

వ్యవధి చాలా తక్కువగా ఉండటంతో కన్నన్ ఫోన్‌కాల్ విషయం తాత్కాలికంగా మరుగున పడింది. బాలెవాడి రూమ్‌కు చేరుకుని, లగేజ్ ప్యాక్ చేసుకుని రైల్వేస్టేషన్ చేరుకునేసరికి ఏడున్నర అయింది.

'థ్యాంక్‌గాడ్!' ఇంత బిజీషెడ్యూల్‌లో కూడా పదినిమిషాలు ముందుగానే స్టేషన్‌కి చేరగలిగి నందుకు కొంత రిలాక్స్‌డ్‌గా ఫీలయ్యేను.

అదిగో మళ్లీ అప్పుడొచ్చింది తిరిగి కన్నన్ నుంచి ఫోన్.

"ఆమెను మర్చిపోలేకపోతున్నాను" భారంగా వినిపించింది కన్నన్ స్వరం.

ఒక్కక్షణం నేనేం విన్నానో అర్థంకాలేదు. అర్థమయిన మరుక్షణం షాకయ్యేను.

సెవెన్‌ఇయర్స్ ఇచింగ్ అంటే ఇదేనా? కన్నన్ వివాహమయ్యి ఏడేళ్లు దాటింది. వివాహమయిన ఏడేళ్లకు మగాడి మనసు మరో స్త్రీ మీదకు మళ్లుతుందని పుస్తకాల్లో చదివేను. కన్నన్ విషయంలో అది నిజం కాబోతోందా?

కన్నన్ ఆమె తాలూకు వివరాలు అన్నీ చెప్పుకొచ్చినట్టున్నాడు. చెప్పటం పూర్తయిన తరువాత "ఏమంటావు?" ప్రశ్నించేడు.

అసలే మస్తిష్కం మొద్దుబారిపోయి ఉంది. పైపెచ్చు ఒకటే రణగొణధ్వని. కన్నన్ చెప్పిందేదీ నా చెవికెక్కలేదు. హైదరాబాద్ వచ్చిన తరువాత మాట్లాడుకుందామంటూ ఫోన్ కట్ చేసేను. సెకండ్ ఏ.సి. చల్లదనం వేడెక్కిన నా మెదడుని చల్లబరచలేకపోతోంది. 'కన్నన్‌ని ఇంతగా డిస్టర్బ్ చేసిన ఆమె ఎవరు?' నాకు తెలిసి కన్నన్ చాలా ఉత్తముడు.

వయసులోనూ, సర్వీస్‌లోనూ నాకంటే జూనియర్. అయితేనేం మామధ్యన అరమరికలు లేని స్వచ్ఛమయిన స్నేహం ఉంది. అందుకు కారణం ఒకటే వృత్తి అనేకంటే ఒకటే ప్రవృత్తి అనటం సబబు. అవును... నేనొక కవినయితే కన్నన్ మంచి రచయిత. ఆ భావసారూప్యతే కన్నన్‌ను, నన్నూ మంచి మిత్రుల్ని చేసింది.

కన్నన్ స్వతహాగా తమిళుడయినా బాల్యమంతా హైదరాబాదులోనే గడిచింది. నాలాగే

**పులిపాక కనకదుర్గ**

అతను కూడా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్. మామధ్య పరిచయం వయసు మూడేళ్లు. మూడేళ్ల క్రితం ట్రాన్స్‌ఫర్ మీద నేను పనిచేస్తున్న ఆఫీసుకి వచ్చాడు. ఓ మారు మాటలమధ్యన తెలిసింది మా ఇరువురి ప్రవృత్తీ ఒకటేనని. అలా చిగురించిన స్నేహం ఏపయిన లతలా పెనవేసుకుంది. కన్నన్ భార్య సుధ నన్ను స్వంత అన్నయ్య కంటే ఎక్కువగా అభిమానిస్తుంది.

నాకు తెలిసి కన్నన్, సుధలది చాలా అన్యోన్యమయిన దాంపత్యం. వాళ్లకు ఇద్దరూ అబ్బాయిలే. కిందటినెలే ఏడవ మ్యారేజి ఏనివర్సరీ జరుపుకున్నారు. ఇంతలోనే కన్నన్ పిడుగులాంటి ఈ వార్త చెప్పేడు.

వివాహేతర సంబంధాలు సంసారంలో ఎంతటి కల్లోలాల్ని రేపుతాయో కన్నన్‌కు మరొకరు చెప్పాలా? తెలియని వారికి తెలియజెప్పొచ్చు. కానీ అన్నీ తెలిసిన వారికి ఎలా చెప్పటం?

అయినా సుధకేం తక్కువ? అపరంజి బొమ్మలా ఉంటుంది. రుచికరంగా వంటలు చేస్తుంది. ఇంటిని అందంగా తీర్చుతుంది. నిజం చెప్పాలంటే సుధ కన్నన్ జీవితంలో అందమయిన అదృష్టం. అంతటి అదృష్టాన్ని లక్ష్యపెట్టక ఎందుకు కన్నన్ ఇలా తప్పుదారి పడుతున్నట్టు?

నిజానికి కన్నన్ దినచర్యలో కనీసం సగ భాగం తనకు తెలిసే జరుగుతుంది. వారంలో రెండురోజులైనా ఇందిరాపార్కులోనో, టాంక్ బండ్ మీదనో తామిద్దరూ కలిసి ఇష్టాగోష్ఠి చేస్తూనే ఉంటారు. అలాంటిది తనకు తెలియని ఆమె ఎవరు? ఆమె లేకుండా ఉండలేనంత సాన్నిహిత్యం వారి మధ్యన ఎప్పుడు పెంపొందింది?

అన్నీ సమాధానం లేని ప్రశ్నలే.

ఒకసారి తల విదిలించేను.

కన్నన్‌కు సంబంధించిన ఆలోచనలు పక్కకు పెట్టి అప్పుడే వచ్చిన వేడివేడి టొమాటో సూప్ తీసుకున్నాను. డిన్నర్‌కని ఎగ్‌బిర్యాని ఆర్డరిచ్చాను.

డిన్నర్ ముగించి బెర్తుమీద మేను వాల్చగానే తిరిగి కన్నన్ తాలూకు ఆలోచనలు కందిరీగల్లా నన్ను చుట్టుముట్టేయి.

'ఎవరామె?'

ఎవరయి ఉండవచ్చు?

ఇలా కాదనుకుని కన్నన్‌కి రింగ్ చేసేను.

ప్చ్!... స్విచాఫ్ చేసుంది.

ఇంతకీ కన్నన్‌ని ఇంతగా మెస్మరైజ్ చేసిన ఆమె ఎవరు? తిరిగి ఆలోచనలు మొదటికే వచ్చేయి.

కన్నన్ ఎవరెవరితో క్లోజ్‌గా ఉంటాడో గుర్తు తెచ్చుకోటానికి ప్రయత్నించేను.

కన్నన్ డిపార్ట్‌మెంట్‌లో విమలా అయ్యంగార్, సుచేతాదాస్‌లు మాత్రమే లేడీ ఎంప్లాయీస్. నాకు తెలిసి వారిద్దరి వయసూ కన్నన్ కంటే

> "పరహితం అంతశ్శక్తిని మేల్కొలుపుతుంది. పరుల మేలుకోసం చేసిన పని ఎంత చిన్నదైనా, అది మనలోగల అంతఃశక్తిని మేల్కొలుపుతుంది. ఇతరులకు కొద్దిపాటి ఉపకారం ఊహించడం సైతం హృదయానికి సింహబలాన్ని ఇస్తుంది"
>
> – స్వామి వివేకానంద

చాలా ఎక్కువ. ఇంకెవరయి ఉంటారా అని తిరిగి ఆలోచించేను.

మంచి వక్త, రచయిత అయిన కన్నన్ స్త్రీల విషయంలో సిగ్గరి కిందే లెక్క. కన్నన్ నాకు పరిచయమయిన మూడు సంవత్సరాల్లో స్త్రీలతో సన్నిహితంగా మెలిగిన దాఖలాలు ఎక్కడా లేవు.

బహుశా కన్నన్ ఇక్కడకు రాకమునుపే ఆమెతో పరిచయం ఏర్పడి ఉండవచ్చు. మొత్తానికి కన్నన్ మనసు దోచుకున్న చిన్నదాని ఆనవాలు మటుకు కనిపెట్టలేకపోయాను. కానీ, ఎలాగయినా నచ్చచెప్పి కన్నన్‌ను ఈ రొంపి నించి బయట పడెయ్యాలని గట్టిగా నిర్ణయించుకున్నాక కునుకు పట్టింది.

*   *   *

పూనా శారి శ్రీమతికి ఎంతగానో నచ్చింది.

వారంరోజుల తరువాత రుచి చూడబోతున్న ఆంధ్రా బ్రేక్‌ఫాస్ట్ ఘుమఘుమలు అప్పుడే చవులూరిస్తున్నాయి. ప్రొద్దుట సరాసరి ఆటోలో ఇంటికి వచ్చేసాను.

నన్ను చూడగానే శ్రీమతి, పిల్లల ఆనందానికి అవధులు లేవు. కాలకృత్యాలు తీర్చుకుని వచ్చేసరికి శ్రీమతి డైనింగ్ టేబుల్ మీద టిఫిన్ సిద్ధంగా ఉంచింది. నేతిపూరీలు, బంగాళా దుంపల కూర, చింతచిగురు చట్నీలతో బ్రేక్‌ఫాస్ట్ ముగించి, చిక్కటి ఫిల్టర్‌కాఫీ రుచిని ఆస్వాదిస్తూండగా కన్నన్ విషయం గుర్తుకొచ్చింది.

నేను ఫోన్ చేద్దామనుకున్నంతలో కన్ననే ఫోన్ చేసాడు.

"గురువుగారూ ఆమెను మర్చిపోలేకపోతున్నాను. తనను మా ఇంటికి తీసుకురావాలని అనుకుంటున్నాను. మీరే ఎలాగయినా సుధని కన్విన్స్ చేసి ఒప్పించాలి".

కన్నన్ మాటలకు నాకు మతిపోయినట్టయ్యింది.

ఏం మాట్లాడుతున్నాడసలు? ఆమెతో వ్యవహారమే తప్పనుకుంటే అది చాలదన్నట్టు సరాసరి ఇంటికే తీసుకువస్తానంటున్నాడు. నాకు తెలియకుండానే కన్నన్ మీదున్న గౌరవాభిమానాలు పలుచనయ్యేయి. "ముందర నువ్వు మా ఇంటికి వచ్చెయ్యి – అన్ని విషయాలూ మాట్లాడుకుందాం" ఏ అభిప్రాయమూ వ్యక్తపరచకుండా కన్నన్‌ని రమ్మన్నాను.

కన్నన్‌తో కఠినంగా వ్యవహరించాలని అర్ధమయింది.

మరో అరగంటకు మా ఇంట్లో ఉన్నాడు కన్నన్.

"ఇప్పుడు చెప్పు. ఎవరామె?" సీరియస్‌గా ప్రశ్నించేను.

డ్రాయింగ్ రూంలో మేమిద్దరమే ఉన్నాం.

చిత్రంగా చూసేడు కన్నన్ నావేపు. "అదేమిటి గురువుగారూ, అంతా విని ఏమీ తెలియనట్టు మాట్లాడుతున్నారు? నిన్న ఫోన్‌లో మీకు వివరంగా చెప్పేను కదా!"

"నిన్న రైల్వేస్టేషన్ రణగొణధ్వనుల్లో నాకు దాదాపుగా ఏమీ వినిపించలేదు. అందుకే మరోసారి చెప్పమన్నది" ఫ్రాంక్‌గానే అన్నాను.

కొద్దిక్షణాలు ఏమీ మాట్లాడకుండా తల వెనక్కి వాల్చి కళ్లు మూసుకున్నాడు కన్నన్. మనిషి నలిగిఉన్నాడు. గడ్డం కూడా మాసింది. ఆవేదనగా ఉన్నాడు. పరితాపం చెందినవాడిలా ఉన్నాడు.

కాసేపటి తరువాత కళ్లు తెరిచి నావేపు

చూసేడు కన్నన్. "కిందటి శనివారం కదా మీరు పూనా వెళ్లింది" అంగీకారం కోసమన్నట్టు నా వేపు చూసేడు కన్నన్.

"అవున"ని ముభావంగా అన్నాను.

"ఆ మర్నాడే ఆమెని నేను మొదటిసారి చూసింది"

"ఒహో అయితే చాలా ఫాస్ట్ వ్యవహారం అన్నమాట" వ్యంగ్యంగా అన్నాను. పజిల్డ్‌గా చూసేడు నావేపు.

"ఉదయాన్నే కూరగాయల కోసమని రైతు బజార్‌కు బయలుదేరాను. అప్పుడే ఆమెను చూశాను. హృదయవిదారకమయిన పరిస్థితిలో ఉంది ఆమె. ఆమెకొచ్చిన కష్టం ఎవరికీ రాకూడదు" కన్నీళ్లని కర్చీఫ్‌తో అదిమిపెట్టి గద్గద స్వరంతో చెప్పేడు.

"అలాగా! జాలిలోంచి పుట్టుకొచ్చిన ప్రేమన్న మాట. ఇంతకీ నీ జాలిగుండెని సుధ అర్థం చేసుకుంటుందనే అనుకుంటున్నావా?" వెటకారంగా అన్నాను.

నా మాటల్లో వెటకారాన్ని గ్రహించే స్థితిలో లేదు కన్నన్.

"తల్లిదండ్రులిద్దరినీ దోపిడీదొంగలు నిర్దాక్షిణ్యంగా చంపేసేరు సార్. పాపం ఇప్పుడు ఆమెకెవరూ లేరు సార్. చిన్నవయసులోనే అనాధయిపోయింది. కళ్లెదురుగా తల్లిదండ్రులని కిరాతకంగా చంపటం చూసి డీప్‌షాక్‌లో ఉంది సర్. చిన్నపాప సర్, చిన్నపాప..." దోసిళ్లలో మొహం దాచుకుని భోరుమన్నాడు కన్నన్.



కొవ్వూరులో మనాశ్రీ కవితా సంపుటి 'నాలో...' ఆవిష్కరణ సభలో సినీ గేయ రచయిత సతీష్‌కుమార్, మున్సిపల్ వైస్‌ఛైర్మన్ పరిమి హరిచరణ్, ప్రముఖ కవి కొత్తపల్లి సత్య శ్రీమన్నారాయణ, ఆచార్య దోర్బాల ప్రభాకరశర్మ, రచయిత మనాశ్రీ, జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు డా॥ కె. రమేష్.

ఒక్కసారిగా నిర్ఘాంతపోయేను. కన్నన్ ఆ చిన్నపాపను సైతం 'ఆమె' అంటూ గౌరవించ డం అప్పుడే గమనించేను.

"ఏమంటున్నావు కన్నన్? నిన్న నువ్వు నాకు ఫోన్‌లో చెప్పింది చిన్నపాప గురించా?" నా స్వరం నాకే హీనంగా అనిపించింది.

"అవును సర్ ఆమె గురించే నేను మీకు చెప్పింది. ఆ స్థితిలో ఆ పాపను చూసినప్పటి నుంచి మర్చిపోలేకపోతున్నాను. పాప ఇప్పుడు హోమ్‌లో ఉంది. పాపని ఎడాప్ట్ చేసుకుని ఇంటికి తీసుకురావాలని అనుకుంటున్నాను. మీరంటే సుధకు చాలా గౌరవం. మీరే ఎలా గయినా సుధని కన్విన్స్ చేయాలి"

'ఎంత అరుదయిన ఔన్నత్యం కన్నన్‌ది?'

'ఎంతోమంది ఆ హృదయవిదారకమయిన దృశ్యాన్ని చూసి ఉండవచ్చు. కానీ ఎవరు కన్నన్ లా స్పందించగలిగేది? ఎవరు కన్నన్‌లా ముందు కొచ్చి ఆపన్నహస్తం అందించగలిగేది?'

'ఉన్నాడా లేడా? ఉంటే ఎక్కడున్నాడంటూ' ఎంతో కాలంనించి నేను అన్వేషిస్తున్న భగ వంతుడు కన్నన్‌లో, కన్నన్ రూపంలో కనిపిస్తు న్నాడు. ఆకాశమంత ఎత్తున ఉన్నాడు కన్నన్.

కన్నన్ గురించి సంకుచితంగా ఆలోచించి నందుకు నామీద నాకే ఆగ్రహం కలిగింది.

"ఎందుకంత తప్పుగా ఆలోచించేను? కన్న న్ ప్రవర్తనలో నాకెప్పుడూ తప్పులు కనిపించ లేదు. అతని పక్కన మరే ఇతర స్త్రీనీ చూడలేదు. కన్నన్ మాటల్లో కూడా ఎక్కడా తేడా లేదు. జస్ట్ 'ఆమె' అని స్త్రీకి సంబంధించిన ప్రస్తావన రాగానే మనసెందుకు వక్రగతిన ఆలోచించిం ది? నా మనస్సాక్షి స్వచ్ఛమయినదే అయితే నిజంగా కన్నన్ మరొక స్త్రీని మోహించినా ఎటువంటి ఆధారమూ లేని తరుణంలో మంచి మార్గాన్నే ఆలోచనలు పయనించేవి. ఏమీ లేకపోయినా ఎంత తప్పుగా ఊహించుకున్నా ను? ఏ విషయం గురించి అయినా ముందు చెడుగానే ఆలోచించటానికి ఎందుకిలా అల వాటు పడ్డాను?"

ఒక్క విషయం మటుకు సువిదితమయ్యిం ది. అంతఃకరణ స్వచ్ఛమయినదే అయితే చెడు లో కూడా మంచిని గ్రహించగలుగుతాము. ఆ స్వచ్ఛతే లోపించిననాడు మంచి కూడా చెడు గానే కనిపిస్తుంది.

ఎదుటివారిలో తప్పులు ఎంచేముందు అంతఃకరణను శుద్ధి చేసుకోవాల్సిన అవసరం ఉందని తెలిసొచ్చింది.

నా మౌనాన్ని కన్నన్ మరోలా అర్థం చేసు కున్నట్టున్నాడు.

"ఏం గురువుగారూ సుధ అంగీకరిస్తుందం టారా?" ఆదుర్దాగా ప్రశ్నించేడు.

స్వచ్ఛతకు, మానవత్వానికి ప్రతీకలా ప్రకాశి స్తున్నాడు కన్నన్. 'ఇంతటి ఉదాత్తమయిన స్వభా వం కలిగిన మనిషి గురించా నేను ఇంత చెడు గా తలపోసింది?"

'మనస్సెంత మలినమయినది కాకపోతే ఎదుటి వారిలో చెడుని మాత్రమే చూడటానికి అలవాటు పడుతుంది?' యధార్థం భరింపరా నంత చేదుగా ఉంది.

కన్నన్ నావేపే దీనంగా చూస్తూ ఉన్నాడు.

"నువ్వేమీ వర్రీ అవ్వకు కన్నన్. సుధని ఒప్పించే పూచీ నాది!" మనసులోని సంఘర్షణ ను, భావసంచలనాన్ని దాచిపెట్టి మనస్ఫూర్తిగా అన్నాన్నేను. ●